ఆయకట్టుకు సాగునీరు అందేనా?

- పేరుకు మాత్రమే కుడికాల్వ
- డిండి సాగునీటిపై సన్నగిల్లిన రైతుల ఆశలు
- కాల్వలో పూడిన మట్టి.. ముందుకు సాగని నీరు
- కాల్వ సరిగా లేక డిండి వాగులో వృథాగా పోతున్న నీరు
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు


గువ్వలోనిపల్లి సమీపంలో చెట్ల పొదలతో నిండిన డిండి ప్రాజెక్టు కుడి కాల్వ

ఉప్పునుంతల: ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడి ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీటితో జిల్లా సరిహద్దులోని డిండి ప్రాజెక్టు ఇరువై రోజులుగా ఉధృతంగా అలుగుపారుతోంది. ప్రాజెక్టులోకి పూర్తి స్థాయిలో నీరు ఉన్నా ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధి ఉప్పునుంతల మండలంలో ఉన్న కుడికాల్వ కింద ఆయకట్టుకు మాత్రం సాగునీరు అందని ద్రాక్షగానే మారింది. సాగునీటి విషయంలో మండల రైతులకు తీరని అన్యాయం జరుగుతోంది. ప్రాజెక్టులో నీటి ముంపుతో పాలమూరు జిల్లా రైతులు భూములు నష్టపోగా సాగునీరు అందే విషయంలో నల్గొండ జిల్లా రైతులకు మాత్రమే ప్రయోజనం చేకురుతోంది. మొదట ఎడమ కాల్వ ద్వారా నల్గొండ జిల్లాకు మాత్రమే సాగునీరందేది. ఇరువై ఏళ్ల క్రితం పాలమూరు జిల్లాకు సాగునీరందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన కుడి కాల్వ పనులు వంతుకు గంతేసినట్లు చేపట్టి పట్టింపులేకుండా వదిలేశారు. ప్రస్తుతం డిండి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీరు నిండి అలుగుపారడంతో కుడి కాల్వ వెంట నీళ్లు వదిలినా మట్టి కాలువ పూడిపోయి చెట్లు పెరగడంతో నీళ్లు ముందుకు వెళ్లడంలేదు. వడ్డెర గుడిసెల వరకు సిమెంట్ కాల్వలో కొద్దిపాటి నీళ్లు వస్తుండటంతో రైతులు కొంతమంది ఈ కాల్వ నీటితో పంటలు పండిస్తున్నారు. వడ్డెర గుడిసెల నుంచి గువ్వలోనిపల్లి మర్రికుంట వరకు మట్టికాల్వను ఆధునీకరించకపోవడంతో నీరు ముందుకు వెళ్లడం లేదు. కాల్వను తవ్వినప్పటి నుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందలేదు. తీగలకుంట కింద ఉన్న సిమెంట్ కాల్వ ఎత్తు సరిపడ లేక నీరు కాల్వ ఎక్కిపారడం, కాల్వకు అక్కడక్కడ రంధ్రాలు పడి కొంతనీరు ప్రాజెక్టు దిగువన డిండివాగులో వృథాగా పడిపోతోంది. లత్తీపూర్ శివారు వరకే నీరు కాల్వ వెంట వస్తోంది.

కుడి కాల్వ ద్వారా 325 ఎకరాలకు సాగు నీరు..

ఉప్పునుంతల మండలంలోని లత్తీపూర్, గువ్వలోనిపల్లి శివారులోని 325 ఎకరాలకు సాగునీరందేలా ప్రాజెక్టు కుడివైపు మట్టి కాల్వను తీశారు. డిండి ప్రాజెక్టులో 16 అడుగుల నీరుంటేనే కాలువకు అందేలా నీటి నిల్వ నీటి మధ్య నుంచి కుడికాల్వను తవ్వారు. లత్తీపూర్, వడ్డెర గుడిసెలు, గువ్వలోనిపల్లి, మర్రికుంట వరకు దాదాపుగా 7 కిలోమీటర్ల మట్టి కాల్వ ఆధునీకరణకు రూ.1.50 కోట్లు (జపాన్ నిధులు) ఖర్చుచేశారు. ఈ నిధులలో 5 కిలోమీటర్ల మేర కాల్వను ఆధునీకరించారు. కొంత దూరం రాళ్లతో కట్టిన పాత కాల్వ రిపేరుతోనే సరిపెట్టారు. మట్టి కాల్వను సీసీతో ఆధునీకరించే పనులు చేపట్టారు. పాత కాల్వకు అక్కడక్కడ సిమెంట్ పూతలు పూసి చేతులు దులుపేశారు. సీసీతో పనులు నాసిరకంగా చేయడంతో కాల్వకు అక్కడక్కడ పగుళ్లు వచ్చాయి. వడ్డెర గుడిసెల నుంచి మర్రికుంట వరకు రెండు కిలోమీటర్ల మేర సీసీ పనులు చేపట్టకుండా వదిలేయడంతో మట్టికాల్వ అధ్వానంగా తయారైంది.

డ్రెయినేజీని తలపిస్తున్న కుడి కాల్వ..

డిండి ప్రాజెక్టుపై నల్గొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ అధికారుల అజమాయిషీ ఉండటంతో పనులు నామమాత్రంగా చేసి చేతులు దులుపేశారు. లక్షలు ఖర్చుచేసినా ప్రాజెక్టు కుడి కాల్వ గ్రామాల్లో నిర్మించే చిన్నిపాటి డ్రెయినేజీని తలపిస్తోంది. కాల్వను చూస్తే జిల్లాకు చెందిన రైతులపై సవతితల్లి ప్రేమ చూపించారనేది స్పష్టంగా కన్పిస్తోంది. వడ్డెర గుడిసెల నుంచి మర్రికుంట వరకు మట్టి కాల్వను ఆధునీకరించే వరకు చివరి వరకు నీరు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా కుడికాల్వ వెంట సాగునీరు అందించే విషయంలో ప్రజాప్రతినిధులు శ్రద్ధ తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

డిండి నిండినా సాగునీటిపై ఆశలేదు..



డిండి ప్రాజెక్టు నిర్మించినప్పుడు కేవలం ఎడమ వైపు కాల్వ ద్వారా నల్గొండ జిల్లా రైతులకు మాత్రమే సాగునీరు అందేది. ఆరవై ఏళ్ల తర్వాత పాలమూరు జిల్లా ఆయకట్టుకు నీరందిస్తామని తీసిన కుడికాల్వ ఇరువై ఏళ్లు గడిచినా ఒక్క పంట కూడా సరిగా పండించుకోలేదు. డిండి ప్రాజెక్టు అలుగుపారుతుందనే సంతోషమే కాని, మాకు సాగునీరు అందుతుందనే ఆశమాత్రం లేదు. ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

– కదారి సత్యనారాయణ, రైతు, లత్తీపూర్

క్లుప్తంగా

నేడు సీపీఎం జిల్లా కమిటీ సమావేశం

నాగర్‌కర్నూల్ రూరల్: సీపీఎం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ జిల్లా కార్యాలయంలో ఉంటుందని, ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ సాగర్ హాజరవుతారని జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



ఉప్పునుంతల: తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద బీమాను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడాన్ని హర్షిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శనివారం అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు అనంతరెడ్డి, నర్సింహారెడ్డి, నర్సింహారావు, శేఖర్‌గౌడ్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లి హరిచంద్ర, జిల్లా అధ్యక్షులు మోహన్, మండల అధ్యక్షుడు మల్లేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



కొల్లాపూర్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం కొల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తారాసింగ్, సలీం, బాలునాయక్, సంజీవ్, వెంకటస్వామి, ఎల్లయ్య, బంగారి, రామకృష్ణ ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



వెల్దండ: సైబర్ నేరాలపై యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. మండలంలోని గుండాల ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నట్లు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకింగ్ వివరాలు, ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్ ఓటీపీలు చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ రీనా పాంచాల్, ఉపాధ్యాయులు అనిల్, రాహుల్, పర్వీన్, సుధీర్, అవినాష్ , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చదువుకుంటేనే భవిష్యత్

కల్వకుర్తి రూరల్: చదువుకుంటేనే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని హెచ్‌ఎం నెహ్రూ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని లింగసానిపల్లి పాఠశాల విద్యార్థులకు వీరభద్ర రెడీమేడ్ బట్టల వ్యాపారం యాజమాన్యం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాతలు కుమారస్వామి, అంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలో జీతాలు చెల్లించాలి

అచ్చంపేట రూరల్: గిరిజన సంక్షేమ శాఖలోని హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న దినసరి కూలీలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం అచ్చంపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 64 అమలు నిలిపేసి పాత పద్ధతిలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 9న జరిగే చలో ప్రజా భవన్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేందర్, గోపాల్, భరత్, పర్వతాలు, ఓంప్రశాంత్, ముసలయ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు పంచాయతీ కార్యదర్శి విష్ణు భూమిపూజ చేశారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం సకాలంలో ఇంటి నిర్మాణం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మన్నె బిచ్చిరెడ్డి, సాంబశివుడు, కురుమూర్తి, కృష్ణయ్య, వెంకటస్వామి, నాగేంద్రం, కార్తిక్, కమలమ్మ, సత్యనారాయణ, నర్సింహ, రాములు ఉన్నారు.

లడ్డు వేలం రూ.60 వేలు

చారకొండ: మండలంలోని జూపల్లిలో భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాగణపతి మండపం వద్ద 21కిలోల లడ్డును మాజీ వైస్ ఎంపీపీ జూపల్లి వెంకటయ్య దక్కించుకున్నారు. రెండో లడ్డు 11 కిలోలు జీకేఎస్ జ్యూవేలరి శ్యామ్ రూ.44 వేలకు దక్కించుకున్నాడు.

మండలానికి 3 ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు

లింగాల: ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రీ ప్రైమరీ విద్యా బోధనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండలానికి 3 ప్రీ ప్రైమరీ స్కూల్ మంజూరైనట్లు ఎంఈఓ బషీర్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కొత్తకుంటపల్లి, మగ్దూంపూర్, సూరాపూర్ ప్రాథమిక పాఠశాలలో త్వరలో ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు ఎంఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 21 ప్రీ ప్రైమరీ పాఠశాలలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. లింగాల, వంగూర్, కోడేర్ 3 ప్రీ ప్రైమరీ పాఠశాలలు, కొల్లాపూర్, పెంట్లవెల్లి, ఉర్కొండలో 2 చొప్పున, అమ్రాబాద్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి, తాడూర్, తిమ్మాజీపేట ఒకటి చొప్పున ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్లు తెలిపారు. ఆయా పాఠశాలలో ఇన్‌స్ట్రక్టర్లుగా, ఆయాలుగా పని చేయడానికి ప్రభుత్వం దరఖాస్తులను కోరింది.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మన్ననూర్: గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆర్‌బీకే అచ్చంపేట టీమ్ ఆధ్వర్యంలో శనివారం హెచ్‌డబ్ల్యూఓ తిరుపతమ్మ సమక్షంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు హిమోగ్లోబిన్‌తో పాటు సాధారణ పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న బాలికలను సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి పరీక్షలు చేయించి మందులు ఇచ్చారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మహేశ్వరి, మంగ, హెచ్‌ఎం తిరుపతమ్మ, ఫార్మసిస్టు రాజా, ఏఎన్‌ఎం రేణమ్మ, కమలబాయ్ పాల్గొన్నారు.

పంటల నమోదు చేసుకోవాలి

కోడేరు: మండలంలోని రైతులు పంటల నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగజ్యోతి తెలిపారు. ప్రతి రైతు ఏఏ పంటలు సాగు చేశారో ఆ వివరాలను ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్దండ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు ఉండడంతో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సొసైటీ వద్ద పోలీసుల పహారా


పెంట్లవెల్లిలో సొసైటీ దగ్గర పోలీసుల బందోబస్త్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సొసైటీ దగ్గర పోలీసుల పహారా నిర్వహించారు. గతంలో యూరియా రాష్ట్రం దాటుతుందని కొద్ది రోజుల క్రితం పత్రికల్లో వచ్చింది. రాష్ట్రంలో యూరియా కొరత ఉంది. పలు కేంద్రాల దగ్గర రైతులు క్యూ నిలబడడం, ఆందోళన చేయడం వంటివి ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శనివారం పెంట్లవెల్లి సొసైటీ దగ్గర పోలీసులు పలు జాగ్రత్తలు చేపట్టారు. రైతుల పాసుబుక్కులు పర్యవేక్షించి, ఆధార్‌కార్డు, పాస్‌బుక్కులు జిరాక్స్ తీసుకొని సంతకం చేసి యూరియా పంపిణీ చేస్తున్నారు.

రైతులకు యూరియా సరఫరా చేయాలి

అచ్చంపేట రూరల్: రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సైదులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. రైతులకు సరిపడా యూరియా అందించడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, రాములు, రైతులు వెంకటయ్య, చంద్రు, లింగమ్మ, రామచంద్రయ్య, అంజనమ్మ, గణేష్‌నాయక్, సతీష్ పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన కల్వకుర్తిలో పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అన్నం, నీళ్లు మానేసి యూరియా కోసం రైతులు లైన్‌లో గంటల తరబడి వేచి చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చెన్నయ్య, లక్పతి నాయక్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఊరట


పెంట్లవెల్లిలో నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చారకొండ: కేంద్ర ప్రభుత్వం పన్నుపై తీసుకున్న నిర్ణయంతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మరింత ఊరట లభించనుందని బీజేపీ మండల అధ్యక్షుడు చేలమోని కృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రధాన రహదారిపై అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్ర, మూలె వెంకటేష్, దామోదర్, కురుమూర్తి, శ్రీహరిశర్మ, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేణుగోపాల్, వెంకటేష్, ప్రవీణకుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


కల్వకుర్తిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రాజేందర్ తదితరులు



పెద్దకొత్తపల్లిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బిజినేపల్లి మండలంలోని కారుకొండలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని హెచ్‌ఎం రామకృష్ణ అన్నారు.

- తిమ్మాజిపేటలో జిల్లా ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సత్యనారాయణశెట్టి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.
- పెద్దకొత్తపల్లి మండలం నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డు పొందిన 10 మంది ఉపాధ్యాయులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మార్సీ కార్యాలయంలో సన్మానించారు.
- చారకొండ మండలం శేరి అప్పారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కావలి ప్రశాంత్ కుమార్ ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో అవార్డు అందుకున్న నలుగురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.
- కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి భవనంలో ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన శ్రీనివాసులుతో పాటు 30 మందిని సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.
- తాడూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.

తాగునీటి కోసం రాస్తారోకో

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 20 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో శనివారం మహిళలు ఖాళీ బిందెలతో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వారికి బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. బీజేపీ మండల అధ్యక్షుడు పరుశరాముడు, బీఆర్‌ఎస్ నాయకులు నాగరాజు మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల్లో నీటిని సరఫరా చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాగరాజు, మేకల శివ, సిద్దార్థ, నర్సింహ, రాజశేఖర్, పాండు, బ్రహ్మం, కర్ణా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


పెద్దకొత్తపల్లి రహదారిపై ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉమ్మడి అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

అమ్రాబాద్: మండల కేంద్రంలో తూర్పు పొడజాతి పశువుల క్యాటిల్, బ్రీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం ఎమ్మెల్యే అమ్రాబాద్‌లో పలు కార్యక్రమాల్లో మాట్లాడారు. తెలంగాణలోనే ప్రామాణికమైన నల్లమల పొడజాతి పశువులు, పెంపకందారులు అధికంగా ఉన్నారన్నారు. ఇందుకోసం పొడజాతి పశువుల క్యాటిల్, బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు చేయిస్తానని, ఇందుకోసం అమ్రాబాద్ సమీపంలోని ప్రభుత్వ భూమి 913 సర్వేనంబర్ పరిశీలన చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలు సిబ్బందితో సమావేశమయ్యారు. సంఘాల పనితీరు, సంఘాల బలోపేతంకోసం చేపడుతున్న కార్యక్రమాలను అ డిగి తెలుసుకున్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. రూ.11 కోట్లతో అమ్రాబాద్‌లో జరుగుతున్న రోడ్డు విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పరిశీలించారు. కొత్తపల్లి గ్రామంలో పాఠశాలకు దాత అలరాజు బెంచీలు వితరణ చేశారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నా రు. అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మాట్లాడారు. త్వరలోనే అమ్రాబాద్ మండలంలో సబ్‌స్టేషన్‌కు సంబంధించిన స్థల సేకరణ చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో నాలుగు లైన్ల రోడ్డుతో పాటు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ లింగయ్య, అమ్రాబాద్, పదర మండల పార్టీ అధ్యక్షుడు హరినారాయణ గౌడ్, రామలింగయ్య యాదవ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బాలింగం గౌడ్, చత్రునాయక్, సంతోష్, హలరాజు, రాజారాం గౌడ్, లక్ష్మణ్, ఖైసర్, పాండు, శ్రీనివాసులు, రవి, మల్లేష్, సురేష్ ఉన్నారు.

విద్యుత్ సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త

అచ్చంపేట రూరల్: విద్యుత్ వినియోగం పెరగడంతో సరఫరాలో సమస్యలు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే 33/11కేవీ సబ్‌స్టేషన్ కోసం శనివారం స్థల పరిశీలన చేశారు. పట్టణంలోని సీతరాలగుట్టలో తహసీల్దార్ సైదులు, విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ మురళితో కలిసి పరిశీలించారు.

మహిళా సంఘాలకు రూ.23.71 కోట్లు



తిమ్మాజిపేట: స్వయం సంఘాల మహిళలకు ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తిమ్మాజిపేట మండలంలోని 563 స్వయం సహాయక సంఘాలకు రూ.23.71 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్దేశించినట్లు జిల్లా అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి తెలిపారు. శనివారం తిమ్మాజిపేటలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా శ్రీనిధి, బ్యాంకు లింకేజి రుణాలను స్వయం సహాయక గ్రూపులలో మహిళలకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 60 సంఘాలకు రూ.6.34కోట్ల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈనెల చివరి వరకు మరో రూ.6కోట్ల రుణాలు ఇవ్వాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీఎం నిరంజన్, ఏపీఓ సత్యనారాయణ, సీసీలు నాగరాజు, యాదమ్మ, వెంకటేశ్వరమ్మ ఉన్నారు.

కల్వకుర్తి ప్రిన్సిపాల్‌కు రాష్ట్రస్థాయి అవార్డు



కల్వకుర్తి: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న నాగమణికి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణి, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి సైదులు అవార్డును అందజేశారు. ప్రిన్సిపాల్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు రావడంతో పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

సామూహిక వ్రతాలు

తాడూరు: మండలంలోని సిర్సవాడ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం అనంత పద్మనాభ స్వామికి వ్రతాలు, పూజలు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

గౌడ జేఏసీ కమిటీ ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో శనివారం కల్లు దుకాణదారుల సమావేశంలో మండల గౌడ సంఘం జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ప్రసాద్‌గౌడు, మోహన్‌గౌడు, అధ్యక్షుడిగా అశోక్‌గౌడు, ఉపాధ్యక్షులుగా రాజగౌడు, సాయికుమార్‌గౌడు, ప్రధాన కార్యదర్శిగా భరత్‌గౌడు, రవీందర్‌గౌడు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నట్లు వారు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

తెలకపల్లి: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ దిపాసెబాస్టీయన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. 1న కళా ఉత్సవంలో భాగంగా నేషన ల్ పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వివిధ అంశాలలో పోటీలలో శాంతి నికే తన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఎంపికై న విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సురేందర్‌రావు, ఇంద్రకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

కారు, ట్రాక్టర్ ఢీ

నాగర్‌కర్నూల్ క్రైం: కారు, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. మున్సిపాల్టీ పరిధిలోని ఎండబెట్ల శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ఎండబెట్ల వైపు వస్తున్న ట్రాక్టర్‌ను తాడూరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్, కారు బోల్తా పడ్డాయి. కారులో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఓటరు ముసాయిదా విడుదల



చారకొండ: మండల వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా శనివారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాను పంచాయతీ కార్యదర్శి గణేష్‌తో కలిసి ఎంపీడీఓ శంకర్‌నాయక్ విడుదల చేశారు. జాబితాపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈనెల 8 వరకు స్వీకరిస్తారు, 9న అభ్యంతరాలు పరిష్కరించి 10న ఓటర్ల తుది జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను వెల్లడిస్తామని ఎంపీడీఓ తెలిపారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గాను జెడ్పీటీసీ 1, ప్రాదేశిక నియోజక వర్గాలు 6, ఓటర్లు 21,176, పురుషులు10,693, మహిళలు 10481, ఇతరులు 2 ఉన్నట్లు తెలిపారు.

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ లక్ష్మీదేవి ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈనెల 8న అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రఘు, జూనియర్ అసిస్టెంట్ యూసుఫ్, రామంజనేయులు ఉన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి మాజీ సర్పంచ్ అశోక్‌కుమార్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వాటర్ బాటిళ్లతో పాటు క్రీడాసామగ్రిని శనివారం పాఠశాలలో విద్యార్థులకు అందించారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంపిక చేసుకొని చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సుధాకర్, డీలర్ రేణుకుమార్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకటస్వామి, గోవింద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

పెద్దకొత్తపల్లి: పెద్దకారుపాముల ఉన్నత పాఠశాలల్లో 2003–2004 పదో తరగతి చదివిన శంషాద్ బేగం కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులకు గురికావడంతో పూర్వ విద్యార్థులు రూ.22,500 శనివారం కుటుంబానికి అందజేశారు. పెద్ద కారుపాముల గ్రామానికి చెందిన హరికుమార్ అనారోగ్యంతో బాధపడుతుంటే పూర్వ విద్యార్థులు రూ.20 వేలు ఆయన కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఈశ్వర్, వినోద్‌కుమార్ రెడ్డి, కరీం, సికేందర్ మల్లయ్య, రాములు,కృష్ణయ్య, రవికుమార్, సుధాకర్, నాగరాజు పాల్గొన్నారు.

జూపల్లి అరుణ్ పుట్టినరోజు వేడుకలు



కొల్లాపూర్: మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ పుట్టినరోజు వేడుకలు శనివారం కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో, మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద కేక్‌లను కట్‌చేశారు. బాణాసంచా కాల్చారు. పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమాల్లో నాయకులు పసుపుల నర్సింహ, వంగ రాజశేఖర్‌గౌడ్, ఎక్బాల్, కేతూరి ధర్మతేజ, ఖాదర్‌పాష, బింగి మహేష్‌యాదవ్, రమేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

6వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



కోడేరు: మండలంలోని తీగలపల్లిలో భూ నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 6వ రోజుకు చేరాయి. వారికి మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.